క్లుప్తంగా

వైభవంగా అష్టాదళ పాద పద్మారాధన



అష్టాదళ పాద పద్మారాధన సేవలో అమ్మవారు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబ చంద్రశేఖర దేవస్థానంలో మంగళవారం అమ్మవారికి అష్టాదళ పాద పద్మారాధన సేవ వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామునే అమ్మవారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, వివిధ రకాల పండ్ల రసాలు, నిమ్మ రసంతో ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అనంతరం 108 వెండి పుష్పాలచే అమ్మవారికి పూజలు చేసి చీర, ఒడి బియ్యం కార్యక్రమాన్ని పూర్తి చేసి మహామంగళ హారతులు ఇచ్చారు. కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ, అర్చకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందాలి



సచివాలయ రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీపీ

నంద్యాల(రూరల్):అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా చూడాలని ఎంపీపీ శెట్టి ప్రభాకర్ సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు సూచించారు. మంగళవారం మండల పరిధి లోని రాయమాల్పురం గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ప్రతి పథకాన్ని వలంటీర్లు ప్రజలకు వివరించాలన్నారు. సచివాలయానికి వచ్చే ప్రజల పట్ల మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విశ్వనాథరెడ్డి ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: కేంద్రం పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లును వెంటనే ప్రవేశ పెట్టాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్యమాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రం చాగలమర్రిలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం రెవెన్యూ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఏపీలోని ఉషామెహ్రా కమిషన్ నివేదిక ఆధారంగా ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశ పెట్టాలన్నారు. కార్యక్రమంలో డప్పు చర్మకళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం,ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు చిన్నోబులేసు, నాయకులు విజయ్‌కుమార్, పాములేటి, నడిపి ఓబులేసు, ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కిట్ల పంపిణీ



కిట్లను అందజేస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ

ఆళ్లగడ్డ: చాగమర్రి మండలంలోని ఉపాధి హామీ సిబ్బందికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లను ఎంపీపీ వీరభద్రుడు, ఎంపీడీఓ భాగ్యలక్ష్మి మంగళవారం అందజేశారు. ఉపాధి హామీ పనులు సక్రమంగా జరిగేలా చూడాలని వారు సిబ్బందికి సూచించారు. ఎండలు పెరగుతున్నాయని ఉదయం త్వరగా వచ్చేలా కూలీలకు అవగాహన కల్పించాలన్నారు. లేదంటే వడదెబ్బ వచ్చే ప్రమాదం ఉందన్నారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతి కూలికి పనులు కల్పించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీఓ నిర్మల, ఏఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

విద్వేషపూరిత పోస్టులు పెడితే కఠిన చర్యలు

పగిడ్యాల: సామాజిక మాధ్యమాల్లో విద్వేషపూరిత పోస్టులు పెట్టి శాంతిభద్రతలకు విఘాతం కలిగించాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ముచ్చుమర్రి ఎస్ఐ నాగార్జున హెచ్చరించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల నెహ్రూనగర్, పీకే ప్రాగటూరు గ్రామాల్లో చోటుచేసుకున్న నీటి మునక భూముల వ్యవహారంపై వాట్సాప్, ఫేస్‌బుక్‌లలో పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత అంటూ పోస్టులు పెట్టడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఆ కేసులో ఇరువర్గాలకు కౌన్సెలింగ్ ఇచ్చి, బైండోవర్ చేశామని చెప్పారు.

ఊరు ఉండమంది.. బొమ్మ బతకమంది

- బొమ్మలు, దుప్పట్లు, ఐరన్ వస్తువుల విక్రయాలతో వ్యాపారం
- ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడికి వచ్చి ఉపాధి పొందుతున్న వైనం
- సీజనల్ వస్తువుల వ్యాపారమే లక్ష్యం
- నంద్యాల జిల్లాకు వందల కుటుంబాల వలస



ఫుట్‌పాత్‌పై అమ్మకానికి పెట్టిన బొమ్మలు



కొడవళ్లు, గొడ్డళ్లు తయారు చేస్తున్న మధ్యప్రదేశ్ వాసులు

నంద్యాల(అర్బన్): అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో వ్యాపారాలు చేసే వారిలో స్థానికులతో పాటు ఇతర రాష్ట్రాల వ్యక్తులు తప్పని సరిగా కనిపిస్తారు. వారిలో ఎక్కువగా రాజస్తాన్, గుజరాత్, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, బిహార్ తదితర ప్రాంత వాసులు ఉంటారనడంలో సందేహం లేదు. బతుకు దెరువు కోసం కొన్నేళ్లుగా జిల్లాకు వలస వస్తున్నారు. చిన్నచిన్న వ్యాపారాలు చేస్తూ కొన్ని కుటుంబాలు ఇక్కడే ఉండిపోతున్నాయి. కుటుంబం గడవడం కోసం రహదారులపై కొందరు, బండ్లపై జ్యూష్ అమ్మకాలు సాగిస్తూ మరికొందరు, గిఫ్ట్ బొమ్మలు అమ్మతూ ఇంకొందరు జీవిస్తున్నారు. వ్యవసాయ పనిముట్ల తయారీతోనూ కొందరు బతుకీడుస్తున్నారు. అలాగే వర్షా కాలంలో రెయిన్ కోర్టులు, చలికాలంలో స్వెట్టర్లు అమ్ముతున్నారు. ఉపాధి చూపిస్తున్న ఊరిని విడువలేక కష్టమైనా, నష్టమైనా జిల్లాలోనే ఉంటూ వ్యాపారాలు సాగిస్తున్నారు.

సొంత గ్రామాల్లో ఉపాధి కరువై..

మధ్యప్రదేశ్,రాజస్తాన్, బిహార్ రాష్ట్రాల్లో వారానికి రెండు మూడు రోజులే పనులు దొరుకుతుండటంతో చేతిలో పని లేక తినడానికి తిండి లేక ఇబ్బందులు పడిన కుటుంబాలు బతుకుదెరువు కోసం ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలకు వలస వస్తున్నారు. గుజరాత్, ఉత్తరప్రదేశ్ ప్రాంతాల్లో పనులు లేక ఏటా వందలాది కుటుంబాలు జిల్లాకు వచ్చి వ్యాపారాలు సాగిస్తున్నారు.

నైపుణ్యమే ఆధారం..

చిన్న పిల్లలు ఆడుకునే వస్తువులు, ఇంటి అలంకరణకు వినియోగించే బొమ్మలు, వంట పాత్రలు తయారు చేసి ఉపాధి పొందుతున్నారు. ఆశించిన స్థాయిలో కాకుండా వారు బతకడానికి కావాల్సిన ఉపాధి జిల్లాలో దొరుకుతోంది. మధ్యప్రదేశ్, రాజస్తాన్ రాష్ట్రాలకు చెందిన మరికొందరు ఇనుప వస్తువులు అప్పటికప్పుడే తయారు చేస్తూ విక్రయాలతో జీవనం పొందుతున్నారు. సాధారణంగా బొమ్మలు, వంట పాత్రల ధరలు దుకాణాల్లో ఎక్కువగా ఉంటాయి. పిల్లలకు చిన్న బొమ్మ కొనాలంటే రూ.500పైనే ఉంటుంది. హోల్‌సేల్ పేరుతో రూ.వేలల్లో ధరలు నిర్ణయించి వ్యాపారులు అమ్ముతుంటారు. అయితే రాజస్తాన్, గుజరాత్, ఉత్తరప్రదేశ్ వారి వద్ద(ఫుట్‌పాత్‌పై) మాత్రం పిల్లల బొమ్మలు, ఇనుప వస్తువులు తక్కువ ధరలకే అందుబాటులో ఉండటంతో మధ్య తరగతి ప్రజలు వీటిపై ఆసక్తి చూపుతున్నారు. ప్రతి బొమ్మ మీద రూ.50 నుంచి రూ.100 వరకు మిగులుతుందని తయారీ దారులు చెబుతున్నారు.

ధైర్యంగా ఇక్కడే ఉంటున్నాం



పదేళ్ల క్రితం నుంచి నంద్యాల జిల్లాకు వస్తూ బొమ్మల వ్యాపారంతో జీవనం సాగిస్తున్నాం. మా కుటుంబ సభ్యులు కాశీలో తయారు చేసిన బొమ్మలను తెచ్చుకొని అమ్మకాలు సాగిస్తూ జీవిస్తున్నాం. మూడు నెలలకో, ఆరు నెలలకో ఒకసారి మా ఊరికి వెళ్తా. వచ్చిన డబ్బులను మా కుటుంబ సభ్యుల అకౌంట్లలో జమ చేస్తూ మరిన్ని బొమ్మలు నంద్యాలకు తెచ్చి అమ్ముతుంటాం. బొమ్మల అమ్మకాల ద్వారా మా కుటుంబాలకు ఉపాధి దొరుకుతుంది.

– చరణ్, బొమ్మల వ్యాపారి, కాశీ, ఉత్తరప్రదేశ్

నంద్యాల అంటే ఇష్టం



ఆంధ్రప్రదేశ్‌లో అనేక ప్రాంతాల్లో వస్త్ర, బొమ్మల వ్యాపారాలు నిర్వహించాం. నంద్యాల ప్రజలు మర్యాదపూర్వక వ్యాపారాలు చేస్తారు. అందుకే నంద్యాల అంటే ఇష్టం. కొన్నేళ్లుగా ఇక్కడే ఉంటూ వ్యాపారాలు చేస్తున్నాం. కరోనా సమయంలో నంద్యాల ప్రజల ఆదరణ ఎప్పటికీ మరువలేను. ఆ సమయంలో వ్యాపారంలో నష్టాలు వచ్చినా నంద్యాలను విడిచి పోలేదు. ఇక్కడి ప్రజలు మమ్మల్ని ఆదరిస్తూ బతుకుదెరువు చూపుతుండటం ఆనందంగా ఉంది.

– సాధుయాదవ్, వ్యాపారి, వారణాశి

బార్ అభివృద్ధికి కృషి చేద్దాం



మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయశేఖర్‌రెడ్డి

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల బార్ అసోసియేషన్ అభివృద్ధికి న్యాయవాదులంతా కలిసి కట్టుగా కృషి చేద్దామని బార్ అసోసియేషన్ నూతన అధ్యక్ష కార్యదర్శులు విజయశేఖర్‌రెడ్డి, ప్రతాపరెడ్డిలు అన్నారు. మంగళవారం అసోసియేషన్ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ పాలక వర్గ సభ్యుల పరిచయ కార్యక్రమం, గతంలో పని చేసిన పాలక వర్గ సభ్యులకు వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు విజయశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ జూనియర్ న్యాయవాదులకు ప్రతి వారం సీనియర్ న్యాయవాదుల చేత న్యాయ సలహాలు, సూచనలు, చట్టాలపై అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రఘుప్రకాష్ పాల్గొన్నారు.

తక్షణ సాయం అందజేత



నగదును అందజేస్తున్న కౌన్సిలర్ చంద్రశేఖర్

నంద్యాల(అర్బన్): పట్టణంలోని 26వ వార్డుకు చెందిన తలారి చిన్న తిమ్మయ్య ఈనెల 1వ తేదీ అనారోగ్యంతో మృతి చెందాడు. వార్డు కౌన్సిలర్ మేస చంద్రశేఖర్, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ మనోహర్, వలంటీర్ మేరి మంగళవారం మృతుడి భార్య తలారి నాగలక్ష్మికి తక్షణ సాయం రూ.10 వేలు అందించారు.

బీజేపీని గద్దె దించాలి



మాట్లాడుతున్న రామచంద్రయ్య

నంద్యాల(అర్బన్): మతతత్వ పార్టీ బీజేపీని 2024 ఎన్నికల్లో గద్దె దించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన పార్టీ జిల్లా జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్నారు. ప్రజారక్షణ కోసం దేశ వ్యాప్తంగా అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ఈనెల 14 నుంచి మే 15వ తేదీ వరకు పార్టీ జాతీయ సమితి తలపెట్టిన పాదయాత్రలు కొనసాగుతాయన్నారు. 2008 ఎన్నికల్లో విదేశీ బ్యాంకుల్లో దాచిన నల్లడబ్బు తిరిగి తెచ్చి పేదలకు అందిస్తామన్న నరేంద్రమోదీ మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్రయ్య మాట్లాడుతూ నిరుద్యోగులకు రెండుకోట్ల ఉద్యోగాలు, రైతులను ఆదుకునేందుకు ప్రత్యేక చట్టాలు తెస్తామన్న కేంద్ర ప్రభుత్వం నేటికీ ఎందుకు అమలు చేయలేకపోయిందన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్‌గాంధీ ఎన్నికల ప్రచార సభలో లలిత్ మోదీ, నీరజ్ మోదీలు ప్రజల సొమ్మును దోచుకొని ఆర్థిక నేరస్తులు అయ్యారని మాట్లాడినందుకు పార్లమెంట్ సభ్యత్వం రద్దు చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, జిల్లా నాయకులు సుంకయ్య, రంగనాయుడు, బాబాఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

గజవాహనంపై దర్శనమిచ్చిన లక్ష్మీరంగనాథుడు



భక్తులకు దర్శనమిస్తున్న లక్ష్మీరంగనాథ స్వామి

జూపాడుబంగ్లా: తర్తూరు శ్రీ లక్ష్మీరంగనాథుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడో రోజు మంగళవారం స్వామివారు గజవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. చెక్కబొమ్మ రూపంలో ఉన్న స్వామివారికి పన్నీటితో స్నానం చేయించి పంచామృతాభిషేకం, పుష్పార్చన, కుంకుమార్చన, మహా నైవేద్యం, మహామంగళహారతి వంటిపూజాది కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని గజవాహనంతో అలంకరించిన ప్రభోత్సవ వాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు కాయ, కర్పూరాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బుధవారం సాయంత్రం 5 గంటలకు రథోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ వెంకటరమణ, చైర్మన్ ప్రతాప రెడ్డి, ప్రధాన అర్చకుడు ఈశ్వరరెడ్డి తెలిపారు.



సుద్దమల్లలో పింఛన్ సొమ్ము అందజేస్తున్న సచివాలయ ఉద్యోగి, కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్

ఊరూరా పింఛన్ల పండుగ

ఉయ్యాలవాడ: మండలంలో ఏప్రిల్ నెల వైఎస్ఆర్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమం మంగళవారం పండుగలా సాగింది. సుద్దమల్ల గ్రామంలో సచివాలయ కన్వీనర్ పల్లె శ్రీనివాసరెడ్డి, గృహ సారథులు క్రిష్ణకిశోర్‌రెడ్డి, వలంటీర్ లక్ష్మీకాంత్, వెల్ఫేర్ అసిస్టెంట్ నాగకుమార్‌లు లబ్ధిదారులైన రత్నమయ్య, రామిరెడ్డి, ప్రతాప్‌రెడ్డిలకు పింఛన్ సొమ్ము అందజేశారు. అలాగే మండలంలో ఉదయాన్నే వలంటీర్లు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఆయా గ్రామాల్లో అవ్వతాతలకు తలుపు తట్టి పింఛన్ మొత్తాన్ని వారి చేతుల్లో పెట్టారు. మండలానికి 3,782 పింఛన్లు మంజూరు కాగా రూ.1,03,72,000లు ప్రభుత్వం విడుదల చేసింది. మొదటి రోజు 78 శాతం పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. బుధవారం వంద శాతం పంపిణీ పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



బండలాగుతున్న వృషభాలు

మిడుతూరు: మండలపరిధిలోని ఉప్పలదడియ గ్రామ రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి (ఆరుపళ్ల విభాగం) బండలాగుడు పోటీలు హోరాహోరిగా సాగాయి. పోటీలను పీరుసాహెబ్ పేట సహకార సొసైటీ మాజీ అధ్యక్షుడు కాతా రమేష్‌రెడ్డి, ఒంగోలు జాతి పశుపోషకులు కాటం మురళీధర్‌రెడ్డి అట్టహాసంగా ప్రారంభించారు. వివిధ ప్రాంతాలనుంచి 10 జతల ఎద్దులు పాల్గొనగా అలగనూరు గ్రామానికి చెందిన బీరం బుల్స్, రోలీ మేడం ఎద్దులు మొదటి స్థానంలో నిలిచి రూ.40 వేలు దక్కించుకున్నాయి. నంద్యాల జిల్లా డి. రంగాపురం గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డి వృషభాలు రెండో స్థానంలో రూ. 30వేలు, పాపిలి మండలం గుడిపాడు గ్రామానికి చెందిన వెంకటరామిరెడ్డి ఎద్దులు మూడో స్థానంలో రూ. 20వేలు, నంద్యాల జిల్లా బోయిలకుంట్ల గ్రామానికి చెందిన గిత్తుల సుభాన్ వృషభాలు నాల్గవ స్థానంలో నిలిచి రూ. 15 వేలు గెలుచుకున్నాయి. పాములపాడు మండలం తుమ్మలూరు గ్రామానికి చెందిన పల్లవి వృషభాలు ఐదవ స్థానంలో నిలిచి రూ. 10వేలు, కర్నూలు పట్టణం కృష్ణానగర్‌కు చెందిన మురళీ మోహన, వెంకటరామిరెడ్డి(కంబైన్డ్ జత) వృషభాలు ఆరో స్థానంలో నిలువగా రూ. 6 వేలు నగదును ఎడ్ల యజమానులకు నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కమతం జయరామిరెడ్డి, ఎల్లారెడ్డి, మహేశ్వరరెడ్డి, వీరారెడ్డి, రాజశేఖరరెడ్డి, జ్ఞానేంద్రారెడ్డి పాల్గొన్నారు.

కుమారస్వామికి విశేషపూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైలశ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం పురస్కరించుకుని ఈఓఎస్ లవన్న, అర్చకులు విశేషక్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. అనంతరం స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

ఇళ్ల పట్టాల పంపిణీ



ఇళ్ల పట్టాలను అందజేస్తున్న ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: అర్హులందరికీ ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తామని ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి అన్నారు. అర్హత ఉండి పట్టాలు మంజూరు కాని వారికి 6–స్టెప్స్ విచారణ పూర్తయిన వెంటనే ప్రభుత్వ అనుమతి తీసుకుని 30 మంది జి.జంబులదిన్నె గ్రామస్తులకు మంగళవారం ఇళ్ల పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీల లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలన్నారు. బిల్లులు వెంటనే మంజూరవుతున్నాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నందీశ్వరుడు, గ్రామ పంచాయతీ కార్యదర్శి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ముంపు భూములు ఎవరి సొత్తూ కాదు



పీకే ప్రాగటూరు గ్రామస్తులను విచారిస్తున్న ఆర్డీఓ

పగిడ్యాల:శ్రీశైలం రిజర్వాయర్ కింద ముంపునకు గురైన భూములు ఎవరి సొత్తూ కాదని వాటిపై ప్రభుత్వానికి తప్పా ఎవరికీ అధికారం లేదని ఆత్మకూరు రెవెన్యూ డివిజనల్ అధికారి ఎం.దాసు తెలిపారు. నంద్యాల జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం ఆర్డీఓ పీకే ప్రాగటూరుకు చేరుకుని గ్రామస్తులతో బహిరంగ విచారణ చేపట్టారు. గత నాలుగు రోజులుగా ముంపు భూముల కోసం పీకే ప్రాగటూరు, నెహ్రూనగర్ గ్రామస్తుల మధ్య తలెత్తిన వివాదం కలెక్టర్ దృష్టికి వెళ్లింది.దీంతో కలెక్టర్ విచారణకు ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ..ఘర్షణలకు పాల్పడితే మునక భూముల్లో ఎవరూ వెళ్లకుండా 145 సెక్షన్‌ను విధిస్తామని హెచ్చరించారు.ప్రభుత్వం పరిహారం చెల్లించడం వలన ఆ భూములపై శ్రీశైలం ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌కు అధికారం ఉందని, వారికి లెటర్ పెట్టాలని తహసీల్దార్ భారతిని ఆదేశించారు. ఆయన వెంట ముచ్చుమర్రి ఎస్ఐ నాగార్జున, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ మురళి, మండల సర్వేయర్ శ్రీనివాసులు ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

కొత్తపల్లి: పేదలకు ఇచ్చే రేషన్ బియ్యాన్ని కొంత మంది డబ్బు సంపదానే ధ్యేయంగా యథేచ్ఛగా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. అదేతరహాలో మంగళవారం రేషన్ బియ్యాన్ని సేకరించి ఓ ఇంట్లో నిల్వ ఉంచగా పోలీసులు దాడులు చేసి పట్టుకున్నారు. మండలంలోని ముసలిమడుగు గ్రామంలో నాగలక్ష్మయ్య అనే వ్యక్తి సుమారు 40 ప్యాకెట్ల రేషన్ బియ్యాన్ని పోగు చేసుకొని వేరే ప్రాంతానికి తరలించేందుకు ఇంట్లో నిల్వ చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకొని ఇంట్లో సోదాలు చేయాగా రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. వాటిని స్టేషన్‌కు తరలించి వ్యక్తిపై కేసు నమోదు చేశారు.

తాగు నీటి సమస్య రానివ్వొద్దు



పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి

రుద్రవరం: తాగునీటి సమస్య రానివ్వకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ మధుసూదనరెడ్డి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మంగళవారం ఆయన ఎర్రగుడదిన్నె గ్రామ సచివాలయం తనిఖీ చేసి అక్కడి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉన్నాయని, భూగర్భ జలాలు అడుగంటి, తాగు నీటి సమస్య నెలకొనే అవకాశముందని వివరించారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ వరలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ షఫ్రక్‌బాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రమోద్ ఉన్నారు.


అమ్మవారికి కొబ్బరికాయల సమర్పణ



అమ్మవారికి కొబ్బరికాయలను తీసుకువెళ్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: చైత్రమాసంలో పౌర్ణమి తర్వాత వచ్చే మంగళవారం, శుక్రవారం ఏ రోజు ముందు వస్తే ఆ రోజు శ్రీశైలశ్రీభ్రమరాంబాదేవికి కుంభోత్సవం జరపడం సంప్రదాయం. ఈ ఏడాది ఏప్రిల్ 11న అమ్మవారికి కుంభోత్సవం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా మంగళవారం అమ్మవారికి కొబ్బరికాయలు సమర్పించారు. కార్యక్రమంలో ముందుగా అమ్మవారి ఆలయ ప్రదక్షిణ మండపంలో కొబ్బరికాయలను రాశిగా పోసి పసుపు, కుంకుమలతో వాటికి పూజాధికాలు జరిపించారు. అనంతరం అమ్మవారికి కొబ్బరికాయలు సమర్పించారు.


భూ ఆక్రమణలపై చర్యలు తప్పవు



ఉన్నవ నాగరాజుతో ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి

మహానంది: దేవదాయశాఖకు చెందిన భూములను ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏపీ స్టాండింగ్ కౌన్సిల్ ఫర్ ఏపీ ఎండోమెంట్స్ (ట్రిబ్యునల్ జోన్–4) ఉన్నవ నాగరాజు హెచ్చరించారు. మంగళవారం ఆయన కుటుంబ సమేతంగా మహానంది వచ్చారు. ఈసందర్భంగా ఆయన దృష్టికి నంద్యాల పట్టణంలోని ఎస్బీఐ కాలనీలో ఉన్న మహానంది దేవస్థానం భూమి ఆక్రమణకు గురవుతున్న విషయాన్ని ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి తీసుకెళ్లారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి



సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ జనార్దన్‌రావు

దొర్నిపాడు: ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని డీఎల్‌పీఓ, జీఎస్‌డబ్ల్యూఎస్ జిలా ప్రత్యేక అధికారి జనార్దన్‌రావు సచివాలయ ఉద్యోగులకు సూచించారు. మంగళవారం మండలంలోని చాకరాజమువేముల, దొర్నిపాడు–1, 2, డబ్ల్యూ కొత్తపల్లె సచివాలయాలను తనిఖీ చేశారు. అనంతరం ఆయన దొర్నిపాడు సచివాలయంలో ఎంపీడీఓ నాగఅనసూయ, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలల ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎంజేఏవై కార్డ్స్, ఎస్‌డీజీ సర్వే, ఏపీ మీసేవ సర్వీసెస్, హౌసింగ్, బయోమెట్రిక్ హాజరు వంటివాటిపై ఆరా తీశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. డీసీఓ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రూ.4 లక్షలతో భవనం మరమ్మతులు



భవన మరమ్మతు పనులు చేస్తున్న దృశ్యం

రుద్రవరం: స్థానిక అటవీ కార్యాలయ ప్రాంగణంలోని ఒక భవనం, సర్వాపురం ఠాణా వద్ద ఉన్న రేకుల షెడ్డును రూ.4 లక్షలతో మరమ్మతులు చేపట్టారు. రేంజ్ అధికారి, సిబ్బంది విధులు నిర్వహించే భవనం ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించింది కావడంతో అక్కడక్కడా దెబ్బ తినింది. సర్వాపురం ఠాణా వద్ద ఉన్న రేకుల షెడ్డుదీ అదే పరిస్థితి. వాటి విషయంపై నివేదికలు సిద్ధం చేసి అటవీ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన వారు ఒక్కో భవనానికి రూ.2 లక్షల చొప్పున మొత్తం రూ.4 లక్షలు మంజూరు చేశారు. వచ్చిన నిధులతో ఇటీవలే పనులు చేపట్టారు.

ఏకవిశ్రాంత వేడుకలు ప్రారంభం



ప్రవచనాలు వినిపిస్తున్న మాతాజీలు

ఉయ్యాలవాడ: స్థానిక వేణుగోపాల స్వామి ఆశ్రమ ంలో ఏకవిశ్రాంత వేడుకలు మంగళవారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఆశ్రమ వార్షికోత్సవంలో భాగంగా మొదటి రోజు ఉదయం గణపతి పూజతో ప్రారంభించారు. 9 నుంచి 11 గంటల వరకు హోమాలు, యజ్ఞం, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉపన్యాసకులు స్వామి ఆత్మవిద్యానంద సరస్వతి, శ్రీ యోగానంద సరస్వతి మాతాజీలు పాల్గొని భక్తులకు ప్రవచనాలు వినిపించారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు మహానందిరెడ్డి, మండలాధ్యక్షురాలు బుడ్డా భాగ్యమ్మ పాల్గొన్నారు.